## క్లుప్తంగా

### శాకంబరీగా శ్రీనీలంపాటి లక్ష్మీ అమ్మవారు



సత్తెనపల్లి: పట్టణంలోని వెంకటపతి కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ నీలంపాటి శ్రీ లక్ష్మీ అమ్మవారి పీఠంలో ఆదివారం శాకంబరి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల కూర గాయలు, పండ్లతో విశేషంగా అలంకరించిన శ్రీ లక్ష్మీ అమ్మవారు శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మాతాజీ శ్యామలమ్మ ఈ కార్యక్రమాన్ని పర్య వేక్షించారు.

### చికిత్స పొందుతున్న జవ్వాజికి మంత్రి అంబటి పరామర్శ

సత్తెనపల్లి: పట్టణానికి చెందిన ఎరువుల వ్యాపారి, ఆర్యవైశ్య సంఘ నాయకుడు జవ్వాజి సత్యనారాయణ అనారోగ్యంతో గుంటూరులోని ప్రైవేట్ వైద్య శాలలో చికిత్స పొందు తుండగా ఆదివారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు వైద్యశాలకు వెళ్లి పరామర్శించారు. సత్యనారాయణ ఆరోగ్య పరిస్థితి పై వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. సత్య నారాయణకు ధైర్యం చెప్పారు. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివ రావు, తదితరులు ఉన్నారు.

### బియ్యం, దుస్తులు పంపిణీ



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక జీవీ మాధవరావు కార్యాలయంలో వెనుకబడిన బ్రాహ్మణ కుటుంబాలకు బియ్యం, నూతన వస్త్రాలు ఆదివారం అందజేశారు. చిలకలూరిపేటకు చెందిన ఆదిత్య బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షులు ఏకామూరుతి రామ శర్మ, కార్యదర్శి పోలూరి రామచంద్రమౌళి, కోశాధికారి పావులూరి శేషగిరిరావు అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చింతలచెర్వు రాఘవేంద్ర రావు, చింతలపూడి భద్రతయ్య, చింతకుంట శంకరరావు, దేవులపల్లి విశ్వనాథ శాస్త్రి, అనఘా గోపాలకృష్ణమూర్తి, సుబ్బారావు, సత్యనారాయణ, శ్రీనివాసాచార్యులు, చంద్రమౌళి, మురళీధర్, శంకరరావు, బి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

### వ్యక్తి ఆత్మహత్య



మృతుడు ఒగ్గు శ్రీనివాసరావు (ఫైల్)

వినుకొండ(నూజెండ్ల): వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. పట్టణంలోని నిమ్మలబావి బజారుకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఒగ్గు శ్రీనివాస రావు(45) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడు శ్రీనివాసరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

### అమ్మవారికి ఆషాఢ పూజలు



నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రతేక అలంకరణలు, విశేష అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. మహిళలు పొంగళ్లు పొంగించి అమ్మవారికి సమర్పించారు. సాయినగర్ భక్త బృందం సభ్యులు అమ్మవారికి ఆషాఢ మాస సారేను సమర్పించారు. ఆలయంలోని యాగ శాలలో నిర్వహించిన చండీహోమంలో పలువురు దంపతులు పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. ఆలయ ఈఓ టి.సుధాకరరెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### రీజనల్ గేమ్స్‌కు కేవీ విద్యార్థులు

నాదెండ్ల: గణపవరం కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు ఈ నెల 11 నుంచి హైదరాబాద్‌లో నిర్వహించనున్న స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రీజనల్ స్థాయి ఆటల పోటీలకు హాజరు కానున్నట్లు ప్రిన్సిపాల్ సాతులూరి విజయ్‌కుమార్ తెలిపారు. అథ్లెటిక్స్ విభాగం రన్నింగ్‌లో 100, 400, 1000, 4000 మీటర్ల దూరం, షాట్‌పుట్, డిస్కస్ త్రో, స్పోర్ట్స్ విభాగంలో ఖోఖో, షటిల్, బ్యాడ్మింటన్, చెస్ పోటీలకు 53 మంది ఎంపికైనట్లు చెప్పారు. సోమవారం ఉదయం హైదరాబాద్‌కు వెళ్లి పోటీలకు హాజరు కానున్నట్లు తెలిపారు.

# చెత్త సమస్యకు మోక్షం

- సత్తెనపల్లి పట్టణానికి 15 ఈ-వాహనాల మంజూరు
- మొదటి విడతగా తొమ్మిది ఈ-వాహనాలు కేటాయింపు
- మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల పై తగ్గనున్న భారం
- ప్రజలు సహకరిస్తే వ్యర్థరహితంగా సత్తెనపల్లి



సత్తెనపల్లికి కేటాయించిన ఈ- వాహనాలను ప్రారంభిస్తున్న మంత్రి అంబటి రాంబాబు(ఫైల్)

సత్తెనపల్లి: పట్టణ ప్రజలను ఎన్నో ఏళ్లుగా పట్టి పీడిస్తున్న చెత్త (వ్యర్థాలు , పారిశుద్ధ్యం ) సమస్యకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపింది. క్లీన్ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా తడి, పొడి చెత్త సేకరణకు 15 ఈ - వాహనాలను మంజూరు చేసింది. మొదటి విడత తొమ్మిది ఈ-వాహనాలను సరఫరా చేయడంతో గత నెల 14న రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు వీటిని ప్రారంభించారు. పట్టణ పరిధిలో 31 వార్డులు ఉన్నాయి. ప్రస్తుతం పారిశుద్ధ్య కార్మికులు ఆయా వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ చేస్తున్నారు. మరి కొందరు రోడ్లపై వేసిన వ్యర్థాలను సేకరిస్తున్నారు. ఇకపై ప్రతి 2 వార్డులకు (సచివాలయానికి ఒకటి చొప్పున) ఈ - ఆటోను కేటాయించనున్నారు. ప్రజలు తమ ఇళ్లలోని వ్యర్థాలను తడి, పొడి చెత్తలుగా వేరు చేసి వీధిలోకి వచ్చిన వాహనంలో ఏర్పాటు చేసిన బాక్సుల్లో వేస్తే చాలు గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ (జీటీఎస్)కు నేరుగా చేరతాయి. గతంలో ఐదుగురు కార్మికులు చేసే పనిని ప్రస్తుతం ఒక వాహనం చేస్తుంది. పట్టణ ప్రజలు సహకరిస్తే అతి త్వరలోనే పట్టణాన్ని వ్యర్థ రహితం గా తీర్చి దిద్దవచ్చు.

**రోజుకు 22 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు...**

సత్తెనపల్లి మున్సిపాలిటీ గ్రేడు -2 పురపాలక సంఘంగా ఉంది. 31 వార్డుల పరిధిలో 54,000 మంది జనాభా నివశిస్తున్నారు. 15,460 కుటుంబాలు ఉన్నాయి. ఇతర ప్రాంతాల నుంచి రోజుకు 16 వేల మంది పట్టణానికి వివిధ పనులపై రాకపోకలు సాగిస్తుంటారు. ఇంజినీరింగ్ కళాశాలలు అందుబాటులోకి రావడంతో విద్యార్థుల చదువుల నిమిత్తం ఎక్కువగా వస్తున్నారు. 16 వరకు అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. వీటిల్లో 350 కుటుంబాలు ఉంటున్నాయి. దీంతో రోజుకు 22 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు వస్తున్నాయి. ఇప్పటి వరకు వచ్చిన వ్యర్థాల జిందాల్‌కు 17 మెట్రిక్ టన్నులు, పిడుగురాళ్ళ మహింద్రా అండ్ మహింద్రాకు 5 మెట్రిక్ టన్నులు పంపుతున్నారు. దీంతో డంపింగ్ యార్డుకు వెళ్ళే పని తప్పింది. డంపింగ్ చేయడానికి అవసరమైన యంత్రాలు ప్రస్తుతం అందు బాటులోకి రావడంతో ఇక పై సేకరించే తడి, పొడి చెత్తను వేర్వేరుగా జీటీఎస్‌కు పంపుతారు. దీంతో పారిశుధ్య సిబ్బంది కొరత సమస్యకు పరిష్కారం లభించనుంది. ఇకపై సేకరించిన చెత్తలో 80 శాతం మేర సంపద సృష్టి కేంద్రాలకు నేరుగా తరలిస్తారు. దీంతో కంపోస్టు తయారీకి అవసరమైన ముడి సరకు అందు బాటులోకి వస్తుంది.



పుష్‌కాట్‌ల ద్వారా చెత్త సేకరణ చేస్తున్న కార్మికుడు

**సత్తెనపల్లి పట్టణ సమాచారం**

| | |
|---|---|
| మున్సిపాల్టీ | - గ్రేడ్-2 |
| వార్డులు | - 31 |
| జనాభా | - 54,000 |
| కుటుంబాలు | - 15,460 |
| నిత్యంవచ్చే జనం | - 16,000 |
| అపార్ట్‌మెంట్లు | - 16 |
| కుటుంబాలు | - 350 |
| శాశ్విత పారిశుద్ధ్యకార్మికులు | - 23 |
| ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్యకార్మికులు | - 133 |
| నిత్యం వెలువడే వ్యర్థాలు | - 22 మెట్రిక్ టన్నులు |

### ప్రజల సహకారం అవసరం



సత్తెనపల్లి పట్టణం చెత్త రహిత స్వచ్ఛనపల్లిగా మారాలంటే ప్రజల సహకారం అవసరం. ఇంటి ముంగిటకు వచ్చే వాహనాలకు తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలి. పాలిథిన్ కవర్లను పూర్తిగా నిషేధించాలి. చెత్తా, చెదారంను కాలువల్లో పడేయకుండా సహకరించాలి. ప్రభుత్వం 15 ఈ-వాహనాలను సత్తెనపల్లికి మంజూరు చేసింది. వాటిల్లో కొత్తగా తొమ్మిది ఈ - వాహనాలను కేటాయించింది. వీటితో చెత్త సేకరణ సులభ తరమైంది.

–కొలిమి షమ్మి, మున్సిపల్ కమిషనర్, సత్తెనపల్లి

## నేడు వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి పర్యటన

అమరావతి: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి సోమవారం మండలంలో పలు గ్రామాల్లో జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని పెదకూరపాడు శాసన సభ్యుడు నంబూరు శంకరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10గంటలకు మండల పరిధిలోని నరుక్కుపాడు పిఎసిఎస్‌లో రైతులకు వ్యవసాయరుణాల పంపిణీ అలాగే 10.30గంటలకు అమరావతిలోని అగ్రికల్చరల్ ఇన్‌పుట్స్‌టెస్టింగ్ ల్యాబోరేటరీని సందర్శిస్తారు. పదకొండు గంటలకు మిరపసెడ్‌లింగ్స్ నర్సరీ, డ్రిప్, స్పింక్లర్‌లకు సంబందించిన పరికరాలను పంపిణీ చేస్తారు. 11.20గంటలకు జూపూడి రైతుభరోసా కేంద్రంలో రైతులకు సీసీ ఆర్‌సి కార్డులు, కంది విత్తనాలను పంపిణీ చేసి రైతులతో ముచ్చటిస్తారు. అనంతరం 11.40 గంటలకు అత్తలూరులోని రైతు ఉత్పత్తి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అర్గానిక్ వ్యవసాయాన్ని పరిశీలించి అక్కడ రైతు ఉత్పత్తి సంఘాల రైతులతో ముఖాముఖి మాట్లాడతారు, ఈ పర్యటనను రైతులు, అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, విజయవంతం చేయాలని ఆయన కోరారు.

### ఎన్ఎఫ్ఎస్ఎం ద్వారా కంది విత్తనాల పంపిణీ

నకరికల్లు: నూరుశాతం రాయితీపై రైతుభరోసా కేంద్రాల ద్వారా ఎల్ఆర్‌జీ-52 రకం కంది విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తెలిపారు. నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్ ద్వారా కంది విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# సర్కార్ బడులకు సరికొత్తశోభ

నాడు: శిథిల భవనాలు .. పెచ్చులూడి పోతున్న గచ్చులు, విరిగిపోయిన బల్లలు, ట్యాప్‌లు ఊడి పోయిన కుళాయిలు ... పని చేయని చేతి పంపులు ... నీటి సరఫరాలేక దుర్వాసన వెదజల్లే మరుగుదొడ్లు. ఇది గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలల దుస్థితి. విద్యార్థుల పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాంకు పుస్తలు తాకట్టు పెట్టాల్సిన పరిస్థితి.

నేడు: వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రభుత్వ పాఠశాలల తీరు పూర్తిగా మారిపోయింది. నాడు-నేడు పథకంలో భాగంగా పాఠశాలలన్నింటినీ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పూర్తి సౌకర్యాల మధ్య పాఠశాలలు పున: ప్రారంభ మయ్యాయి. ప్రారంభం రోజునే జగనన్న విద్యా కానుక కిట్లు, కొత్త పుస్తకాలు అంద జేశారు.

- నాడు-నేడుతో పాఠశాలలను తీర్చిదిద్దిన ప్రభుత్వం
- రూ.కోట్లు వెచ్చించి పాఠశాలల్లో అభివృద్ధి పనులు



నేడు కొత్తరూపు సంతరించుకున్న దమ్మాలపాడు రామాపురం పాఠశాల

సత్తెనపల్లి: పాఠశాలలంటే విద్యాలయాలు, ఇక్కడే సంస్కృతి, సంస్కారం పురుడు పోసు కుంటుంది. అంతటి ప్రాధాన్యం ఉన్న పాఠశాలలు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సౌకర్యాల లేమితో కునారిల్లాయి. అయితే వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టింది. నాడు-నేడు పేరుతో ప్రభుత్వ పాఠశాలలకు కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసి పెద్ద ఎత్తున మౌలిక వసతులు కల్పించారు. దీంతో కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలలు తయారయ్యాయి.

**పూర్తిస్థాయిలో మౌలిక వసతులు...**

ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలంటే పాత భవనాలు .. మరుగుదొడ్ల కోసం విద్యార్థుల ఇబ్బందులు ... సక్రమంగా అందని పుస్తకాలు ... ఇదీ పరిస్థితి. కానీ కాలం మారింది. 2019లో వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. సత్తెనపల్లి నియోజకవర్గంలో తొలి విడతగా 46 ప్రాథమిక, 19 యూపీ, 21 ఉన్నత పాఠశాలలు వెరశి 83 పాఠశాలలు ఎంపిక చేసి పనుల్లో ఎలాంటి అవినీతికి తావు లేకుండా పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్, ప్రధానో పాధ్యాయుడు కలిసి పనులు చేసేలా నిర్ణయం తీసుకు న్నారు. రెండేళ్లలో ఈ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. తిరిగి రెండో విడతలో సత్తెనపల్లి నియోజక వర్గంలో 150 పాఠశాలలను ఎంపిక చేసి రూ.49.10 కోట్లు, పెదకూరపాడు నియోజక వర్గంలో 154 పాఠశాలలను ఎంపిక చేసి రూ.33.15 కోట్లు నిధులు విడుదల చేశారు. ఈ పాఠశాలల పనులు కూడా పూర్తి కావస్తున్నాయి. ఇలా నాలుగేళ్లలో పాఠశాలల స్వరూ పాలే పూర్తిగా మారిపోయాయి. సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజక వర్గాలల్లో తొలి, రెండవ విడత నాడు-నేడు పనులతో పాఠశాలల రూపురేఖలు మారగా మిగిలి పోయిన పాఠశాలలు కూడా మూడవ విడతలో బాగుపడనున్నాయి.

**విద్యార్థుల్లో కళ్లలో ఆనందం ....**

పాఠశాలల్లో కల్పిస్తున్న మౌలిక వసతులు చూసి పేద విద్యార్థులు ఆశ్చర్యపోతున్నారు. ప్రధానంగా బాలికలకు సంబంధించి ఇబ్బందికరంగా ఉండే మరుగుదొడ్ల సమస్య తీరింది. ఇక విద్యాకానుక పేరుతో కార్పొరేటు కన్నా మిన్నగా బూట్లు, యూనిఫాం, బ్యాగ్‌లతో పాఠశాలలకు వెళుతున్నారు. మంచి బల్లలు, ఫ్యాన్లు, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అభ్యసిస్తున్నారు. ఒక్కసారిగా పాఠశాలల్లో ఇన్ని సదుపాయాలు వచ్చే సరికి విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**మారిన రూపురేఖలు ...**

నాడు - నేడు పథకం ద్వారా బడుల స్వరూపాలే మారిపోయాయి. ప్రధానంగా బిల్డింగులు, నూతన మరుగుదొడ్లు, ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ ద్వారా మంచినీటి సౌకర్యం కల్పించడం, భోజనం తరువాత చేతుల శుభ్రతకు వాష్ బేసిన్లు ఏర్పాటు చేయడం, క్లాసులు చెప్పడానికి కొత్త బ్లాక్‌బోర్డులు, అనువుగా ఉండే బల్లలు, రంగులు అద్ది అలంకరించడం, డిజిటల్ క్లాసులు, టీవీ ద్వారా విద్యను అందిచడం లాంటి సౌక ర్యాలు కల్పించడంతో ప్రభుత్వ విద్యపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నమ్మకం పెరిగింది.

**విద్యార్థులకు జగనన్న కానుక.....**

ఏటా పాఠశాలలో తెరిచారంటే విద్యార్థుల తల్లిదండ్రులకు ఒకటే భయం. ఫీజు నుంచి పిల్లలకు బూట్లు, సాక్సులు, పుస్తకాలు, బ్యాగుల కొనుగోలు పేరుతో రూ. వేలల్లో ఖర్చు చేయాల్సి రావడం వారికి తలకు ఇచ్చిన భారం అయ్యేది. నాలుగేళ్లుగా వారికి ఆ భయం లేదు. జగనన్న విద్యా కానుక పేరుతో ప్రభుత్వమే వాటి అన్నిటిని కిట్ల రూపంలో విద్యార్థులకు అందిస్తుంది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఏటా ఒక్కో విద్యార్థికి రూ.2,500 వరకు ఖర్చు చేస్తుంది. ఈ కిట్‌లో మూడు జాతుల యూనిఫాం, రెండు జతలు సాక్సులు, ఒక జత షూ, పాఠ్య, నోట్ పుస్తకాలు, బెల్టు, బ్యాగు, డిక్షనరీ ఉంటాయి. వరుసగా నాలుగో ఏడాది సత్తెనపల్లి నియోజకవర్గంలో 230 పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న 25,822 మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుకల కిట్లు ఈ నెల 12న అందించారు.



అందుబాటులో ఉన్న పాఠ్యపుస్తకాలు

**సత్తెనపల్లి నియోజకవర్గంలో అందుకున్న జగనన్న విద్యాకానుక కిట్లు....**

| మండలం | పాఠశాలలు | బాలురు | బాలికలు | మొత్తం |
|---|---|---|---|---|
| సత్తెనపల్లి | 93 | 5,253 | 6,058 | 11,311 |
| ముప్పాళ్ళ | 35 | 1,745 | 1,822 | 3,567 |
| రాజుపాలెం | 55 | 2,556 | 2,531 | 5,087 |
| నకరికల్లు | 47 | 2,841 | 3,016 | 5,857 |
| మొత్తం | 230 | 12,395 | 13,427 | 25,822 |

## వృత్తి విద్యా కోర్సులతో ఉజ్వల భవిష్యత్

**ఎమ్మెల్యే నంబూరు శంకరరావు**



వేద పారా మెడికల్ కాలేజీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పెదకూరపాడు: వృత్తి విద్యా కోర్సులు చేస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని శాసన సభ్యులు నంబూరు శంకరరావు పేర్కొన్నారు. ఆదివారం పెదకూరపాడులోని అమరావతి రోడ్‌లో నూతనంగా ప్రభుత్వ గుర్తింపు పొందిన వేద పారా మెడికల్ కాలేజీని ఆయన ప్రారంభించారు. కళాశాల డైరెక్టర్ చింతాడ రమేష్ అధ్యక్షత జరిగిన సభలో ఎమ్మెల్యే శంకర రావు మాట్లాడుతూ నర్సింగ్ పారా మెడికల్ కోర్సులు పూర్తిచేసిన వారికి ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నందున విద్యార్థులకు తల్లితండ్రులకు కోర్సుల గురించి అవగాహన కల్పించాలన్నారు. హై కోర్టు న్యాయవాది ఉల్లం శేష గిరిరావు మాట్లాడుతూ అతితక్కువ సమయంలో జీవితంలో స్థిరపడే కోర్సులను గ్రామీణ ప్రాంతాలకు చేరువ చేస్తున్న వేద విద్యాసంస్థలను ఆయన అభినందించారు. తరగతి గదులను డాక్టర్ గజ్జెల నాగభూషణ రెడ్డి ప్రయోగశాలలను పెదకూరపాడు సర్పంచ్ గుడిపూడి రాజులు ప్రారంభించారు. అనంతరం జరిగిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య. క్రోసూరు యార్డ్ చైర్మన్ ఈదా సాంబి రెడ్డి ప్రారంభించారు. వైద్యశిబరంలో డాక్టర్ దాసరి రజనీ కాంత్. డాక్టర్ శారదా రెడ్డి డాక్టర్ జీ రవిశంకర్‌రెడ్డి రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమాలూ కళాశాల అకాడమిక్ డైరెక్టర్ చింతాడ సూర్యప్రకాష్ వైఎస్సార్ సీపీ నాయకుడు కంకణాల శివాజీతో పాటుగా స్థానిక నాయకులు కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎరువులు, పురుగుమందుల అసోసియేషన్ అధ్యక్షుడిగా పెరుమాళ్ల



లక్ష్మీ శివన్నారాయణను సత్కరిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

సత్తెనపల్లి: ఎరువులు, పురుగుమదుల డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సత్తెనపల్లి పట్టణ అధ్యక్షునిగా పట్టణానికి చెందిన పెరుమాళ్ల లక్ష్మీ శివన్నారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని అసోసియేషన్ హాల్లో ఆదివారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. 2023-26 వరకు మూడు సంవత్సరాలు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. గత 13 సంవత్సరాల నుంచి శివన్నారాయణ అధ్యక్షునిగా విశిష్ట సేవలు అందించారు. కార్యదర్శిగా కొంతినేని శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా గుంటుపల్లి రోశయ్య, భవిరిశెట్టి మారుతి కుమార్, ట్రెజరర్‌గా తూనుగుంట్ల శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా కాల్వపల్లి పెద్దిరెడ్డి, రాయుడు శ్రీనివాసరావు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ వ్యాపారులు ప్రత్యేకంగా అభినందించారు. అధ్యక్షుడిగా ఎన్నికైన పెరుమాల లక్ష్మీ శివన్నారాయణను ఆర్యవైశ్య సంఘ పట్టణ అధ్యక్షుడు ఆత్మకూరు వెంకటహరేరామ చెంచయ్య, ఆవోప పట్టణ అధ్యక్షుడు దివ్వెల శ్రీనివాసరావు, ఆర్యవైశ్య యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు కొత్త రామకృష్ణ, వాసవి సేవా సమితి అధ్యక్షుడు దేవరశెట్టి రవికుమార్, ఆడిటర్ మోటమర్రి ప్రేమ్‌చంద్, యువ న్యాయవాదులు పెండ్యాల భరత్, దేవిశెట్టి శరత్, ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం మాజీ అధ్యక్షుడు కొత్త లక్ష్మయ్య, పట్టణ ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు కాపుగంటి శ్రీ వెంకటరత్నం, ఆర్యవైశ్య చలివేంద్ర కమిటీ బాధ్యులు నోముల వెంకటరమణ, చిలకల వాసు, ఆర్యవైశ్య సంఘ రాష్ట్ర నాయకులు దేవతి సుబ్బారావు, ముప్పాళ్ళ మండల ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు పోతుగంటి నరసింహారావు, సంఘ నాయకులు కోట వెంకటబసవయ్య, పులికొండ శ్రీనివాసరావు, పులికొండ మానస, పెరుమాళ్ళ మణికుమార్‌లు ప్రత్యేకంగా పూలమాలు, దుశ్శాలువాలతో సత్కరించారు. అలాగే రోటరీ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి వారి ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో బెల్లంకొండ నాగసాయి ప్రసాద్, మాతంగి సాంబశివరావు, సరికొండ రమాదేవి, పాయసం మహేష్ బాబు, సాయి రమేష్, తదితరులు ఉన్నారు.

## ఓటర్ల జాబితాలపై విచారణ



ముప్పాళ్ళలో ఓటర్ల జాబితాపై విచారణ జరుపుతున్న తహసీల్దార్ భవానిశంకర్

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లోను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేర ఓటర్ల జాబితాలపై విచారణ చేపట్టారు. ఒకే ఇంటి నంబర్‌పై పదికి పైగా ఓట్లు ఉన్న గృహాలను సందర్శించి వారి వివరాలు నమోదు చేసుకున్నారు. అలాగే ఓటర్ల జాబితాలో జీరో ఇంటి నంబర్‌తో ఉన్న ఓటర్ల వివరాలు సేకరించారు. ముప్పాళ్ళలోని పోలింగ్‌స్టేషన్ నంబరు 246లో ఒకే డోర్ నంబరులో 11 ఓట్లు ఉన్నట్లుగా జాబితాలో ఉండడంతో ఆ మేర గృహాన్ని తహసీల్దార్ ఎమ్.భవానిశంకర్, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, వీఆర్వో అశోక్‌లు సందర్శించి వారి వివరాలు నమోదు చేసుకున్నారు. అలాగే అన్ని గ్రామాల్లోను బిఎల్‌ఓలు విచారణ జరుపుతున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

## నేడు వడ్డవల్లిలో జగనన్న సురక్ష

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం పట్టణంలోని వడవల్లిలో జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి హాజరవు తారన్నారు. కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, అధికారులు, వడ్డవల్లి ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

**రేపు 88త్యాళ్లూరు, గుడిపాడులో జగనన్న సురక్ష**

క్రోసూరు: మండలంలోని 88త్యాళ్లూరు, గుడిపాడు గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష శిబిరాల జరుగుతాయని ఎంపీడీఓ బి.మహేష్ ఆదివారం తెలిపారు. ఎంపీడీఓ , తహసీల్దార్ జిలావుల్‌హక్ రెండు టీ ములుగా ఆయా శిబిరాలకు హాజరవుతారన్నారు. శిబిరాల్లో ఆయా గ్రామాల ప్రజలు దరఖాస్తు చేసుకున్న అర్జీలకు ధృవపత్రాలు అందచేయబడుతుందని ఎంపీడీఓ వివరించారు.

## రేపు దివ్యాంగులకు గుర్తింపు శిబిరం

క్రోసూరు: దివ్యాంగులకు అవసరమైన పరికరాలిచ్చేందుకు ప్రభుత్వం ఆధ్వర్యంలో గుర్తింపు శిబిరం మంగళవారం క్రోసూరులోని మోడల్‌స్కూల్‌లో జరుగుతుందని, పెదకూరపాడు నియోజకవర్గ లోని ఐదుమండలాల దివ్యాంగులు సద్వినియోగపరుచుకోవాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆదివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. క్రోసూరు, అచ్చంపేట, బెల్లంకొండ, పెదకూరపాడు, అమరావతి మండలాల వికలాంగులకు చేతికర్రలు, చంక కర్రలు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, మూడు చక్రాల సైకిళ్లు, ఎంఎస్ఐఈడీ కిట్లు, కృత్రిమ అవయవాలు, అందచేసేందుకు అర్హులైన వారిని గుర్తించడం జరుగుతుందని చెప్పారు. దారిద్రరేఖకులోబడి ఆదాయం కలవారు, 40 శాతం వికలాంగత్వం కలిగి ఉన్నవారు అవకాశాన్ని సద్వినిమయోగ పరుచుకోవాలని కోరారు. శిబిరానికి హాజరైయ్యే దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు ఫొటోలు,తీసుకుని రావాలని కోరారు.

## కోల్డ్ స్టోరేజీ ప్రారంభానికి సిద్ధం

**సొసైటీ ఛైర్మన్ చెన్నయ్య**



శీతల గిడ్డంగి భవనం

శావల్యాపురం: శావల్యాపురం సొసైటీ ఆధ్వర్యంలో నాబార్డు నిధులు రూ.6 కోట్లతో నిర్మిస్తున్న శీతల గిడ్డంగి భవన నిర్మాణ పనులు తుది దశకు చేరినట్లు సొసైటీ ఛైర్మన్ నాగులపాటి చెన్నయ్య ఆదివారం తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సహకారంతో నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. మండలంలోని వేల్పూరులో మూడు వేల టన్నులు సామర్థ్యం కలిగిన భవన నిర్మాణ పనులు తుదిదశకు చేరగా ఆగస్టు నెలఖారులో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేతుల మీదగా ప్రారంభోత్సవం చేయనున్నట్లు వివరించారు. అలాగే రైతులు పండించిన పంటలను నిల్వ ఉంచేందుకు ప్రభుత్వ పరంగా 1000 మెట్రిక్ టన్నులు రూ.75 లక్షల వ్యయంతో చేపట్టిన గోదాం నిర్మాణ పనులు పూర్తి అయినట్లు చెప్పారు. మండలంలోని కొత్తలూరు 500 టన్నులు సామర్థ్యంతో రూ.40 లక్షల వ్యయంతో గోదాం పనులు జరుగుతున్నాయన్నారు.